రంగు వెన్నెల

ఖి.చంద్ర

"పెళ్లి చేసుకున్నావా!?"

బాధ, ఆశ్చర్యం, ఆతృతతో కలగా పులగంగా వుందా ప్రశ్న

"ఇద్దరు పిల్లలుకూడా" అన్నాను చిర్నవ్వు నవ్వుతూ.

అతని ముఖం క్షణకాలం రంగు మారింది. చింపిరి కాగితాలు పేర్చి చదివినట్టు ఏదో అని నవ్వాడు పుస్తకంలో ఓ పేజీని పర్రున చింపినట్టుగా

"ఇంటికి వెళదాంరా" అంటూ దారి తీసాను నేను

"సారీ....రాలేను"

ఆగి ఆగి చెప్పాడు. నివ్వెరపోయి చూస్తున్నాను. అతని ముఖంలో ఇందాకటి నవ్వు అలాగే నవ్వుతూ.

"ఒంటరిగాడివైతే వచ్చేవాడ్ని" అన్నాడు.

"అర్థం కావటంలేదు" అన్నాను. నిజాన్ని నిజంగానే ఒప్పేసుకుంటూ.

అతను ఆలోచిస్తూ కాసేపాగి "ఒకందుకొస్తాను, కారణం కూడా అక్కడే చెప్తాను పద" అన్నాడు కరెంటు తీగెలకేసి చూస్తూ.

"ఏంచేస్తున్నావు" అడిగాను.

"సంపాదించటం కోసమైతే ఏమీ చెయ్యటంలేదు. పోగొట్టుకొన్న కాలాన్ని పెరిగే వయసుతో గుణించుకొంటూ ఆ రాసులమీదబతికేస్తున్నాను. ఒకటి ఇంటూ సున్న ఈజ్ ఈక్వెల్‌టు ఏమిటి?"

"అయితే ఆదిలోనే లెక్క తప్పన్నమాట."

ఇద్దరం నడుస్తున్నాం. అతను ఏమాలోచిస్తున్నాడోకాని నేను మాత్రం మున్ఫైయ్యేళ్ళ క్రితం కర్నూలులో మేము చదివిన కాలేజీ ఆవరణలోకి తొంగిచూసాను.

ం ం ం

"రెండేళ్లుగా నాతో చెడమడా తిరిగిన రాధ, మూడు రోజులుగా మాట్లాడ్డం మానేసింది గురూ ఏంచెయ్యమంటావు?"

"ఎంబెంబతు ఇరవై ఏడు మన ఇన్టర్ గేమ్స్ సెక్రటరి రఘుపతిని కలుస్ ఫో."

"సుందరికి వాళ్ళ నాన్న వేరే సంబంధం చూసాట్ట వచ్చేనెల నాలుగో తారీఖున పెళ్ళి. నా బతుకేంకావాలి?"

"ఇప్పుడు టైం ఎంత? పదిం పావేనా? అయితే టెలివిజన్ కేఫ్‌లో టీ తాగుతుంటాడు రఘు త్వరగా వెళ్లు క్విక్ "

"ఎకానామిక్స్‌లో ఎయిటీ ఫైవ్ పెర్సెంట్ సార్. బాబా కాలేజీలో అన్నీ ఖాళీలే కానీ డొనేషన్ లేందే సీట్ ఇవ్వనంటున్నాడు. కాస్త మీరొచ్చి చెప్పండిసార్ "

"అవసరం లేదయ్యా స్టూడెంట్స్‌కి అక్కడ టెన్నీస్ కోచ్ వస్తున్నాడు రఘుపతిలావ్ కానేసాగి వెళ్ళి కలువ్"

"ఏమీ తోచడం లేదు"

"డాక్టర్ తెలుసా?"

"తెలియదు"

"ఏమిటి రఘుపతి తెలీదా? అయితే నీ ఖర్మ చావు "

ఇలా రఘుపతి పేరు హాస్టల్లో, కాలేజీలో, అందరి నోళ్లలో పూర్తిగా గోడల మీద మారుమోగేది అతన్ని ఖాళీగా, కామ్‌గా చూసిన వాళ్ళు లెరు ప్రతి ఒక్కరి సమస్యల్ని అర్థంకాని "పజిల్" లాంటి విషయాల్ని చిటికెలో సాల్వ్ చేసేవాడు రఘు. మోడ్రన్ కంప్యూటర్ లాంటి మనిషి అతని క్వాలిఫికేషన్లనన్నింటిని కలిపి ఎలా పిలవాలో తెలియక చివరికి "డాక్టర్" అని బిరుదిచ్చి అలాగే పిలవడం అలవాటై పోయింది-లెక్చరర్స్‌తో సహా

ఎప్పుడూ టక్ చేసిన మాచింగ్ డ్రస్, చామనచాయ మొఖంలో కలిసిపోయినట్టుండే కొద్దిగా పెరిగిన గడ్డం నూటికి నూరుపాళ్లు ఇరవై అయిదు యేళ్ళ మనిషి అదే మనసు. నిజమైన యువకుడు రగుపతి, అదే కాలేజీలో అతని సరయిన జోడీ "రేవతి" అని ఘంటా పథంగా చెప్పొచ్చు

గాలి మంచురూపంలో తెల్లగా కమ్ముకొని వున్నప్పుడు లోకం ఏడవనీ,నవ్వనీ గుండెపగిలి చావనీ అన్నట్టు కత్తులతో నడచే వీరుల్లా ఇద్దరి చేతుల్లో టెన్నీస్ బెట్‌లతో ఎన్ని ఉదయాల్ని, ఎన్ని జతల కళ్ళని "ఛట్" "పో మ్మన్నారు! . రేవతి నడుంచుట్టూ పూర్తిగా అతనిచెయ్యి మీద వాలి అతని భుజం ఆసరాతో కదిలే చందనపు చెట్టూ, దాన్ని పెనవేసు కొన్న అడవి తీగెలా తుంగభద్ర గట్టు మీద ప్రకృతికి అందాన్ని రాసులుగా పోస్తూ వాళ్లిద్దరూ ప్రేమికుల గుండెల్లో మతాబులు వెలిగిస్తూ ఎక్కడ చూసినా వాళ్ళిద్దరే

'మేం పెళ్ళి చేసుకుంటున్నాం'

రేపు-అనగా మన కాలేజి జన్మ దినోత్సవంనాడు కాలేజి ఆవరణంలో మేం నిర్ణయించుకొన్నట్టు ఉదయం అయిదూ యాభై అయిదు నిమిషాలకు దంపతులం కాబోతున్నాం.

ఇష్టం వున్నవాళ్లు రావచ్చు

ఇష్టం లేనివాళ్లు వాళ్లయిష్టంవున్నట్టు రావచ్చు.

ఇట్లు
రఘు. రేవతి,

ఓ సాయంకాలం చీకటి ఏనుకులు రాల్తున్న వేళ మెరుపు ముక్కల్లా పత్రికలు పంచబడ్డాయి. చీమకూడా చావలేదుకాని ఊరంతా స్మశానంలాగయి పోయింది.

సరిగ్గా ఆ సమయంలో తుంగభద్ర కాల్వ గట్టున ఎప్పటిలాగే నింపాదిగా ఇద్దరూ ఒక్కరై నిర్భయంగా నడుస్తున్నారు ఆ దృశ్యాన్ని చూసి రెండు చేతులెత్తి జన్మ ధన్యమయిందనుకొన్నాను అప్పుడు నా జేబులో ఆరోజు రాత్రి తొమ్మిది గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరే ట్రయిన్ కు టిక్కెట్ లేకపోతే రేపు జరుగబోయే వింతనూ, సాహసాన్ని చూసే వాడ్ని కదా అని ఓపక్క బాధ పడ్డాను

చివరికి కర్నూలులో జయంతికి నామనసప్పగించేసి నాలుగేళ్ల పరిచయాన్ని, ప్రేమను నెమరు వేసుకొంటూ యింటికి చేరాను.

జయంతి, ఆనంద్‌లు ఎప్పటికి రఘుపతి, రేవతిలుకాలేరు, కారు అనుకున్న దానికి సాక్ష్యంగా ఇప్పుడు అశోక్‌నగర్ కాలనీలో "డాక్టర్ ఆనంద్ అనురాధా" అనే నేం ప్లేటు వి కాం. ఫైనల్ చదువుతున్న కొడుకు, ఇంటర్ సెకండియర్‌తో రెండవసారి పోరాడుతున్న కూతురు కనిపిస్తారు.

o o o

గుప్పుమన్న మల్లెపూలవాసన వస్నూ నా ఆలోచనల్ని వెనుకనుండి ముందుకు లాగింది రఘుపతి సిగరెట్ అంటించుకుంటున్నాడు చెర చెరా అంటుకుంటున్న సిగరెట్ కొసను చూసినప్పుడల్లా ఏదో దారుణం జరిగిపోతున్నట్టనిపిస్తుంది నాకు

రూపాయి కాగితం యిచ్చి పూలు పొట్లాం కట్టించుకొన్నాను- పాతికేళ్ళ అలవాటు ప్రకారం.

రఘుపతి కాలి కింద పురుగు తిరుగాడుతున్నట్టు అసహనంగా కదిలాడు.

తెల్లటి పైజామా, లాల్చీ మాయ లేదు, కాని బాగా నలిగున్నాయి కాళ్లకు హవాయ్ చెప్పులు, లాల్చీ మెడనుండి కిందికి వున్న గుండీలు కన బడకుండా బారుగా పెరిగిన గడ్డం. గడ్డం మొదట్లో నెరుపు ప్రారంభమై వెలిగే బల్బుకు నల్లకాగితం చుట్టినట్టుగా వుంది. పైకి ఎగదువ్విన క్రాఫు,

మెడమీది నుంచి బుజాలు తాకే చోట రింగులు తిరిగింది దట్టంగా పెదవుల కిందికి దిగిన మీసాలు సిగరెట్టు పొగకి మాడిసట్లయి కావి రంగులో వున్నాయ్

కాస దూరంలో నిలబడి సిగరెట్టు పీలుస్తున్న రఘుని పరిశీలనగా చూసేను గుర్తుపట్టనంతగా మారిపోయాడు మనిషి ఆ మార్పు నిన్న. మొన్నటిదికాదు దానికి కనీసం నా కొడుకు వయస్సైనా వుండొచ్చు చిత్రం ఏమిటంటే నా ఎదురుగా వస్తున్నఅతన్ని చూసి కూడా దాటిపోతున్నాను నేను. చాటుక్కున చెయ్యి పెట్టి ఆపి "నీ పేరు ఆనందరావు కదూ!" అని అడిగాడు. అయోమయంగా చూస్తున్న నాకు తను చెప్పేదాకా తెలియదు అతను రఘుపతని. అన్నిటికంటేనన్ను ఆశ్చర్యంలో ముంచేస్తున్న విషయం ఏమిటంటే యిద్దరం కలుసుకొన్నాం. అది ముప్ఫయ్యేళ్ల తరువాత అర్ధ గంట పైగా అయింది. తను ఒక్క ముక్క మాట్లాడం లేదు

నా చేతిలోని పూల పొట్లాన్ని చూస్తూ "పూలంటే నాకసహ్యం" అన్నాడు యెంత అసహ్యమో మొహంలో చూపిస్తూ.

"ఎందుకు?"

"ఆడదంటే పరమ అసహ్యం

శ్రీ ఆంజనేయ చరిత్ర

(శ్రీ పరాశర సంహిత)

హనుమద్భక్తులకు, ఉపాసకులకు, హనుమన్మంత్ర విషయమై పరిశోధన చేయదలచిన వారలకు అత్యంత సులభ శైలిలో ఒక్క తెలుగుభాషలోనే వెలువడిన శ్రీ పరాశర మహర్షిచే అందించబడిన "శ్రీ ఆంజనేయ చరిత్ర" 80 భాగములు 7 పుస్తకములుగా వెలువడినది.

7 పుస్తకముల ధర రు : 30/-

ముందుగా రు. 30/-లు ఎం.ఒ. ద్వారా పంపిన వారికి పోస్టేజికి వి.పి పి. పెట్టబడును.

శ్రీ హనుమంతుని గూర్చి పూర్తి వివరములు తెలుసుకొనుటకు, మంత్ర, తంత్ర శాస్త్రము తెలుసుకొనుటకు ఈ ఒక్క గ్రంధమే అనేక విషయములను వివరించ గలదు.

వివరములకు :

శ్రీ హనుమత్సేవాసమితి

కాపూరివారివీధి, సత్యనారాయణపురం, విజయవాడ - 520 011

గనుక" అతని గొంతులో కసి కదం తొక్కుతుంది.

"రేవతంటే కూడానా ?" అడిగాను, నడుస్తున్నవాడు రక్కున ఆగి చూసాడు నన్ను

పులి మనిషి మీద దూకేటప్పుడు అలాగే చూస్తుందేమో ?

నాకు "మా ఆవిడంటే చాలా ఇష్ట" మన్నాను గేటుతీసి లోపలికి నడుస్తూ. తను మా యింటికేసి చూస్తూ మెల్లగా నడుస్తున్నాడు రోగుల్ని చూడ్డం మంచి సీళ్ళ ప్రాయమైన నాకు రఘుపతి కొద్ది కొద్దిగా అర్థమవుతున్నాడు.

కట్టడంలో మా యిల్లు మోడ్రన్ ప్లానే అయినా వాతావరణం మాత్రం పర్ణశాలను గుర్తుకు తెస్తుంటుంది, రఘుని తిన్నగా మేడ మీద నా గదికి తీసుకొచ్చి కూర్చోమన్నాను

సోఫాలో కూర్చుంటూ గోడ కేసి చూసి "నువ్వు డాక్టరివి కదా మరి" అంటు ఆగిపోయాడు

"డాక్టరునే కాని షష్టిలో పడుతున్న వాడ్ని పొద్దువాలిపోతున్నపుడు దీపం ముట్టించుకోవడం ఎంత అవసరమో, సహజమో, పెరిగే వయసు మనిషిని జయించి జీవిత సత్యాన్ని వెతడం కోసం పరిగెత్తడం కూడా అంతేకదా ! అయినా యీ విషయంలో నువ్వే నా కంటే ముందున్నట్టని పిస్తుంది. అవునా ?"

రఘు నాకేసి సూటిగా చూస్తూ "దగా అంటే అర్థం తెలుసా నీకు" అని అడిగాడు.

"బహుశా జీవితం దాంతోనే మొదలవుతుందనుకుంటాను". నా మాట సగంలో వుండాగానే వెంటనే ఆవేశంగా "ఎందుకు నాశనం కావడానికా" అన్నాడు

నేను చిన్నగా నవ్వి "మేము పాయిజన్ని కూడా మెడిసిన్‌గా యూజ్ చేస్తాము తెలుసా ?" అన్నాను

"డాక్టరు కబుర్లు చెప్పకు నాకు నువ్వు జయంతిని ప్రేమించావు కదా".

"అవును"

"ఆమె కూడా నిన్ను ప్రేమించింది కదా"

తలూపాను.

"మరి పెళ్లెందుకు చేసుకోలేదు ?" క్షణక్షణం అతని గొంతులో శబ్దం పెరుగుతూవుంది

"వాళ్ళ తల్లి దండ్రులకు ఇష్టం లేకపోయింది".

"ఆ విషయం వాళ్లు చెప్పారా ? జయంతి కూడా చెప్పిందా ?". గది గోడలు ఖంగుమన్నాయ్

"అందరూ చెప్పారు, అందరి ముందు జయంతి కూడా చెప్పింది"

"వయసు, కులం, అంతస్తు,

చదువు అన్నింటిలోనూ ఇద్దరూ సమానులే కాదా అటువంటప్పుడు నిన్నంతగా ప్రేమించిన మనిషి ఎందుకు చెప్పిందో తెలుసుకున్నావా ?"

"ఇవన్నీ సరిగ్గావుంటే పెళ్లి జరిగిపోవలసిందేననీ, ఎంత ప్రేమించుకున్నా యిందులో ఏ ఒక్కటో లోపించి పెళ్ళి జరక్కపోతే సమంజసమేననీ యెలా అనుకుంటావు. అయినా ప్రేమించుకున్న ప్రతి జంటా పెళ్ళి చేసుకుంటేనే నిజమైన ప్రేమనా నీ వుద్దేశం ?? ప్రేమకి ప్రతిరూపం పెళ్లేనా ??? ప్రతి పెళ్లికి ముందు ప్రేమ పునాది రాయా ? అదే నిజమైతే యిప్పుడు నువ్వు నేను యిలా మాట్లాడుకొనే వాళ్ళం కాదు. జయంతి మీద నాకున్న అధికారం కంటే, ఆమెకు నా మీదున్న ఆశక్తి కంటే, ఆమెమీద తలిదండ్రుల అధికారం, ఆమెకు వాళ్ళ మీదున్న గౌరవం - భక్తి ఏ పరిస్థితుల్లోనూ ఎక్కువే కదా !? ఆమెను నాకిచ్చి పెళ్ళి చెయ్యడం వాళ్ళ కిష్టం లేదు. ఆయిష్టానికి కారణం ఏముంటుంది ? అయినా జయంతిని నేను ప్రేమించినప్పటి ఆనందానికి, అనుభూతికి, అనురాధను పెళ్లిచేసుకొం



కాపురం చేస్తున్న ఆనందానికి, అనుభూతికి సంబంధం లేదు. అక్కడా, ఇక్కడా ప్రేమ సమృద్ధిగానే వుంది నా సంగతలావుంచు నీవాలకం అది చూస్తూంటే రేవతికి, నీకు పెళ్ళి జరిగినట్టు లేదు పత్రికలు కూడా పంచావు కదా ? తరువాత ఏమయింది ?"

రఘుపతి మరో సిగరెట్ వెలిగించి "దాహంగా వుంది కాస్త మంచి నీళ్ళివ్వు" అనడిగాడు కూజాలో నీళ్ళు గ్లాసులోకి ఒంపుతున్నాను

"ఆనందూ! ఒక్క విషయం చెప్పు జీవితాలు కథలా? లేక కథే జీవితమా,"

నీళ్ళగ్లాసు అతని చేతికిస్తూ" జీవితం ముందు, ఆనక మొదలవుతుంది కథ జీవితం- కాదంటావా?" అన్నాను

రఘుపతి నీళ్ళు తాగి రుమాలుతో మూతి తుడుచుకుంటూ "నువ్వు చదివినంత లిటరేచర్ నేను చదివుండక పోవచ్చు నేను చదివిన దాంట్లో బాగా గుర్తున్నదొకటుంది

ఆడ-మగ
ఒకరికొకరు
వత్తీ మంటలా
మగ-ఆడ
ఒకరికొకరు
మంటా వత్తిలా
ఇందులో ఏది నిజం?''

రఘుపతి చేతిలోనిగ్లాసందుకొని టీపాయ్ మీద పెడుతూ "ఇందులో ఏదీ అబద్ధం మాత్రం కాదు కానీ, మంట కావాలనుకుంటే వత్తి ముఖ్యం. వత్తే కావాలనుకుంటే మంట అక్కర లేదు రాసిందెవరోగాని గోడమీది పిల్లిలా వుంది వ్యవహారం, ఒకటి మాత్రం నిజం. జీవితం జీవించడానికి గతించడానికి- అలాజరగాలంటే మనిషి కావాలి, మండాలి మరి అలాం టప్పుడు జీవితం మంటలేని ఒత్తే అయితే ఎలా?"

రఘుపతి గడ్డాన్ని చేత్తో ఒక చివర నవరిస్తూ "నువ్వేదైనా చెప్పు నాకు మాత్రం ద్రోహం జరిగిందిరా ఆరోజు ఉదయం కాలేజీ కాంపౌండ్ లెక్చరెర్స్ స్టూడెంట్స్ వూళ్ళోని పిల్లా-మేకతో నిండిపోయింది అందరి మధ్య నేను ధీరోదాత్త నాయకునిలా ఎంతో ఉత్సాహంగా నిల్చొని వున్నాను రేవతి తన బంధుమిత్రులతో సహా వచ్చింది ఆనందంలో తల మునకలౌతున్న నన్ను ఏంచేసిందో తెల్సా? తనే నన్ను ఉరి తీసినా బాగుండేదేమో, కాని అలా చెయ్యలేదు. అంతమంది ముందు నా యెదురుగా ఎవడో ముక్కు-మొఖం తెలియని మనిషిచేత తలవంచి తాళి కట్టించుకుంది- ఒక్క మాట, ఒక్క పలుకు, చివరికి ఒక్క చూపైనా నాకేసి



చూడకుండా తాదొకటి విసిరేసి నువ్వే ఉరిపోసుకుని చావు అన్నట్టు పోస్టుమార్టం చేసి ఒదిలేసిన శవంలానిల్చున్న చోటే కొయ్యబారి పోయాను నేను"

అతని మాటలు వింటున్న నా కళ్ళ ముందు అతని చెప్పిన దృశ్యం రూపు దిద్దుకుంటోంది. రఘుపతి తనలో తానే చెప్పుకుపోతున్నాడు

''మిస్ రేవతి నా ''షడ్ బీ'' అని ఎందరి ముందు ఛాతీ విరుచుకున్నాను! "రఘు ఆల్వేస్ ఇస్ ఎ లక్కీ ఫెలో"అని ఉన్నా పెద్దా రేవతి ముందే నన్ను పొగిడారు నాకు జరిగినటువంటి శిక్ష కక్ష సాధింపు కనీసం ఏకధలో నైనా చదివావా? నేను రేవతిని దక్కించుకోలేనందుకు బాధపడలేదు. కానీ నాముందే తను పెళ్ళి చేసుకొని కాపురం చేస్తూ నాకు నరకం చూపిస్తుంది అదే నా బాధ".

"అయితే ఇదన్న మాట జరిగిన సంగతి. ఈ విషయంలో నాకు పీకు పెద్ద శేడా ఏమీలేదు."

"దానికి నేను నిరసనగా నేనేం చేస్తున్నానో తెలుసా" అన్నాడు రగుపతి తిరిగి సిగరెట్ వెలిగిస్తూ.

ఏం చేస్తానన్నట్టు చూసాను.

"తర్వాత నేను పెళ్ళి చేసుకోలేదు. నాజీవితాన్ని నా ప్రేమకు త్యాగం చేసాను"

నాగుండె రగుపతి మీద జాలితో నిండి పోయింది. దానిక్కారణం అతను త్యాగం అన్నందుకుకాదు. అనుకుంటూ తన్ను తాను మోసగించుకొంటున్నందుకు.

"సరే అయితే, నిన్ను ప్రేమించిన రేవతికి నిన్ను చేసుకునే అవకాశం ఏ పరిస్థితుల వల్లనో లేదనుకుందాం. వేరొకర్ని చేసుకొని కాపురం చేస్తున్నందులకు నీకు మరింత బాధ అలాంటప్పుడు నీకు బాధ కలగకుండా రేవతి ఏం చేయాలి మరి? ఏమిటి నీ ఉద్దేశం"

"ఒక్క పదం కోసం నా జీవితాన్ని నేనేం చేసుకొన్నానో తాను అంతే" మొండిగా చెప్పాడు రగుపతి

"అప్పుడు ఇద్దరు పిచ్చివాళ్లు తయారవుతారు తెలుసా?"

"అయితే నాది పిచ్చా" సోఫాలోంచి కాస్త లేచి నిలబడ్డాడు రగు

"కాకపోతే త్యాగం అనుకుంటున్నావా" నింపాదిగా అడిగాను తానేమీ మాట్లాడలేదు తిరిగి నేనే అన్నాను 'త్యాగం చేయడానికి నువ్వు ఎవరివి అలాంటి అధికారం ఎవరికీ లేదు ఒకరి జీవిత మార్గం, జీవిత విధానం, పద్ధతి ఇంకొకరికి త్యాగంలా కనిపించాల్సిందేంటి? మనిషి జీవితంలో త్యాగం అనే పదానికి చోటే లేదు"

రగుపతి నాకేసి వెర్రిగా చూస్తూ గొంతు పెగల్చుకొని "అయితే నా ప్రేమ

"ప్రేమ ప్రతి మనిషి పుట్టుకతోనూ మొదలవుతుంది. అందుకే యుగాలు మారినా ఎప్పుడూ కొత్తగానే వుంది. రెండేళ్ల వయసులో పిల్లలు ఆడుకోకుండా వుండడం ఎంత లోపమో. ఇరవై అయిదేళ్ల లోపున మనిషి ప్రేమలో పడకుండా వుండడం కూడా అంతే లోపం యాభై యేళ్ళ తరువాత కూడా పాతికేళ్ళ ప్రేమ తాలూకు అనుభూతి ఛాయల కోసం పలవరించడం అంతకన్న పెద్దలోపం ప్రేమ అన్న పదానికి అర్థం ఎప్పుడూ ఒక్కటే వయసును బట్టి అనుభూతులు మారుతుంటాయి. మారాలి కూడా. అదే నిజమైన ప్రేమ"

రఘుపతితో మాట్లాడుతూ నే టేబుల్ బల్ల డ్రాయరు లాగి అడుగుతున్న ఓ ఉత్తరం, పైనే ఉన్న మరో ఉత్తరం తీసాను. చాలా యేళ్ళ తరువాత తిరిగి అడుగు నుండి తీసిన ఉత్తరాన్ని చదవాలనిపించింది

"మైడియర్ ఆనంద్

హాలిడేస్ పూర్తయి రెండు రోజులయింది ఎందుకిలా చంపుతావు?

నల్లకలువ రేకులు నీ కన్నులనీ,

సన్నజాజి పువ్వులు నీ నవ్వులనీ,

నువ్వు రాసిన మొదటి ఉత్తరంలోని వాక్యాలని ఎన్నిసార్లు చదివి

తృప్తిపడమంటావు? తుంగభద్ర కాల్వ గట్టున సగం తడిసిన నా పైట నీచేత్తో పట్టుకొని ఆరేసిన రోజు గుర్తు రావడంలేదా?? ఆనంద్ ఏ సి థియేటర్లో ఆదేదో భాష సినిమా, ఆ సినిమా చూసే వంకతో ఎన్నిసార్లు లోపల కూర్చున్నాం. మధ్యలో లైట్లారిపోయిన రెండవ రోజు అబ్బా.....సిగ్గు చంపేస్తుంది బాబూ. పోయిన జూలైతో పిక్నిక్ వెళ్ళినపుడు నన్ను అందరికీ దూరంగా తీసుకెళ్ళి ఆ సరుగుడు చెట్టు చాటున........నీ చేతులింకా నా భుజాల చుట్టూ వున్నట్టే వుంది. ఇక ఉత్తరం రాయలేను. ఎంతరాసినా ఎంతో కొంత మిగిలే వుంటుంది ఇంకా ఎన్నాళ్ళిలా నా కందకుండా వుంటావు ఆనంద్? ఎప్పుడొస్తావు? యింకా ఎన్ని రోజులు? ప్లీజ్ వెంటనే వచ్చేయ్. ఉత్తరం అందిన వెంటనే ముందో ఉత్తరం రాయి.

ఇట్లు నీ కోసం, నీ ఉత్తరం కోసం ఎదురు చూసే

—నీ జయంతి"

పెదవులు బిగించి నవ్వాపుకున్నాను. రెండో వుత్తరం నిన్ననే వచ్చింది. దాన్ని చదవక్కరలేదు. అందులోని వన్నీ నాకు గుర్తున్నాయి. సగం ఉత్తరం నా ఆరోగ్యం గురించి, ఎంత డాక్టర్నయినా జాగ్రత్తగా ఉండమని, అనురాధకు బి. పి. ఎలా గుందంటూ పరామర్శ. తరువాత పెద్దాడ్ని ఏం చదివించాలనుకుంటున్నావు, సి ఎ.లోచేర్పించమని సలహా. పిల్ల ఈ సారయినా పాసయే సూచనలు కల్పిస్తున్నాయా అన్న ఆశా భావం తన భర్త సిగరెట్లు తెగకాలుస్తున్నాట్ట. ఈసారి వూరొచ్చినపుడు నన్ను గట్టిగా చెప్పమంది డక్టరుగా. తనకి రెండు నెలల్క్రితం బెణికిన కాలు ఇంకా సర్దుకోలేదట. ఇలా వుందా ఉత్తరం.

నేను మౌనంగా కాసేపు ఆ రెండు లెటర్స్ని చూసి "ఈ రెండు చదువుతూ వుండు" అని రఘుపతి చేతికిచ్చి మెట్లు దిగి కిందికొచ్చాను.

ముప్ఫయేళ్ళ తరువాత చాలా ముఖ్యమైన స్నేహితుడు కలిసాడని వంటింట్లో వున్న అనురాధకు చెప్పి కాఫీ కలపమన్నాను. కాసేపటికి కాఫీ నింపిన రెండు కప్పులతో వచ్చి మీరు తీసికెళతారా అంది. "నువ్వురా మీ యిద్దరిని పరిచయం చేస్తాను" అంటూ శ్రీమతితో మెట్లెక్కాను గదిలో సోఫా మీద చదివి మూసినట్టుగా రఘుపతి కూర్చున్నచోట నేనిచ్చిన రెండు ఉత్తరాలు, ఒకదాని మీద ఒకటి పడి వున్నాయి. నా శ్రీమతి దిక్కులు చూస్తోంది ... అతనికోసం వెతుకుతున్నట్టుగా- "కాఫీ" ఎంతసేపు "వేడిగా" వుంటుంది?!

★